క్లుప్తంగా

తూటేరు పూడికతీత పనుల పరిశీలన



తూటేరు డ్రైనులో గుర్రపు డెక్క తొలగింపును పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీలలిత

సామర్లకోట: మండల పరిధిలో వీకే రాయపురంలోని తూటేరు డ్రైను పూడిక తీత పనులను ఎంపీడీఓ డి.శ్రీలలిత శనివారం పరిశీలించారు. ఈ పనులు పూర్తయ్యే వరకు పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించడంతో ఆమె ఈ పనులను పరిశీలించారు. ఈ పనులు పూర్తయితే ముంపు సమస్య పరిష్కారమై పంటలకు లాభం చేకూరుతుందని రైతులు చెప్తున్నారు.

చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్టు

కొత్తపల్లి: కిరాణా దుకాణంలో చోరీకి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు స్థానిక పోలీసులు శనివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే..మండలంలోని ఉప్పాడ మెయిన్‌రోడ్డులో ఉన్న సాయికృష్ణ కిరాణా దుకాణంలో ఈ నెల 19న చోరీ జరిగింది. యజమాని సఖినాల కృష్ణమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్సై రామలింగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. దుకాణంలో ఉన్న రూ.12,500ను పిఠాపురానికి చెందిన కాకి అనిల్‌కుమార్ చోరీ చేసినట్టు గుర్తించి అతడిని అరెస్టు చేశారు. నిందితుడిని పిఠాపురం కోర్టులో హాజరు పరిచినట్లు పోలీసులు తెలిపారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

కొత్తపల్లి: అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం (ఏపీఆర్‌సీఎస్) రాష్ట్ర కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. మండలంలోని మూలపేటలోని కొత్త వాడపేటలో ఏపీఆర్‌సీఎస్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా మత్స్యకారులకు స్థానికంగానే ఇళ్లస్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు, బి.రమేష్, ఏఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కుంచే అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

లాన్ టెన్నిస్‌లో రోహిత్‌కు స్వర్ణం



జాతీయస్థాయి లాన్ టెన్నిస్ పోటీలలో బంగారు పతకం సాధించిన రోహిత్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): దేశ రాజధాని ఢిల్లీలో ఈ నెల 21 నుంచి 27 వరకు జరిగిన జాతీయస్థాయి లాన్‌టెన్నిస్ పోటీల్లో కాకినాడకు చెందిన దుంపల రోహిత్ అండర్–14 విభాగంలో స్వర్ణ పతకం సాధించాడు. స్థానిక శ్రీనగర్ కార్పొరేషన్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్నాడు. ఢిల్లీలో జరిగిన పోటీలలో పాల్గొనడానికి రోహిత్‌కు సేవ్‌ద పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యం అందించారు. రోహిత్‌ను శిక్షకుడు టాడ్, పాఠశాల హెచ్‌ఎం మహ్మద్ రబ్బాని శనివారం అభినందించారు.

గిరిజన గ్రామాలను ఐదో షెడ్యూల్‌లో చేర్చాలి

రౌతులపూడి: నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి మండలాల్లో సబ్‌ప్లాన్ ప్రాంతాల్లోని గిరిజన గ్రామాలను ఐదో షెడ్యూల్‌లో చేర్చాలని ఆదివాసీ సంఘం ఐదో షెడ్యూల్ సాధన సమితి ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మండలంలోని జల్దాం, రాఘవపట్నం, ఎం.కొత్తూరు గ్రామాల్లో ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. సబ్‌ప్లాన్ గిరిజన గ్రామాలను ఐదో షెడ్యూల్‌లో చేర్చి గిరిజనులందరికీ సమాన ప్రాతిపదికన విద్యా, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. గిరిజన గ్రామాలను ఐదో షెడ్యూల్‌లో చేర్చాలనే అంశంపై ఆదివారం శంఖవరంలో జరిగే గిరిజన సదస్సును విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐదో షెడ్యూల్ సాధన సమితి ప్రతినిధులు జె.ముసలయ్య, బి.బాలరాజు పాల్గొన్నారు.

క్రీడాకారులకు క్రికెట్ కిట్ల పంపిణీ

తుని రూరల్: యువత క్రీడల్లో రాణించాలని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చోడ్రాజు రాంబాబు రాజు సూచించారు. తేటగుంటలో యువకులకు రోడ్లు భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా సమకూర్చిన క్రికెట్ కిట్లను శనివారం ఆయన పంపిణీ చేశారు. గ్రామీణుల్లో క్రీడా స్ఫూర్తిని నింపేందుకు, క్రీడారంగం అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సర్పంచ్ అత్తి నాగరాజు, వైఎస్సార్ సీపీ నాయకుడు గణేషుల వీరబాబు పాల్గొన్నారు.

అమ్మఒడి.. చదువుల సవ్వడి

- విద్యార్థుల ఉన్నతికి సీఎం జగన్ బాటలు
- నియోజకవర్గంలో 25,866 మంది విద్యార్థులకు లబ్ధి
- తల్లుల బ్యాంకు ఖాతాల్లో పడిన సొమ్ములు
- ఆనందం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



విద్యార్థుల తల్లులకు అమ్మఒడి నమూనా చెక్కు అందజేస్తున్న ఎంపీ గీత, ఎమ్మెల్యే దొరబాబు



నాడు–నేడులో అభివృద్ధి చేసిన వాకతిప్ప ఎంపీపీ స్కూల్

కొత్తపల్లి: విద్యారంగంలో సరికొత్త అధ్యాయం ఆవిష్కృతమైంది. పేదరికం చదువుకు ఆటంకం కాకూడదనే ఉన్నత ఆశయంతో అమ్మ ఒడి పథకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్నారు. ప్రతి ఇంటా చదువుల పంట పండిస్తున్నారు. భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. వరుసగా 4వ విడత అమ్మఒడి సొమ్మును తల్లుల ఖాతాలకు జమ చేశారు.

కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి సైతం..

ప్రతిపేద విద్యార్థి చదువుకోవాలనే దృఢ సంకల్పంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మఒడి పథకాన్ని అమలు చేస్తున్నారు. గతేడాది లబ్ధి పొందిన వారితో పాటు కొత్తగా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకూ ఈ ఏడాది పథకాన్ని వర్తింపజేశారు. ఈ నెలలో విద్యార్థుల తల్లుల ఖాతాలకు రూ.15 వేలు చొప్పున జమచేశారు. ఏ విద్యార్థి చదువు మధ్యలో ఆగకూడదనే సంకల్పంతో అధికారంలోకి రాగానే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమ్మఒడి పథకాన్ని తీసుకొచ్చారు. పిల్లల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం ఏటా తల్లుల ఖాతాలకు నిధులు విడుదల చేస్తుండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలో

పిఠాపురం నియోజకవర్గంలో 25866 మంది విద్యార్థులకు జగనన్న అమ్మఒడి పథకం ద్వారా లబ్ధి చేకూరింది. విద్యార్థుల తల్లుల బ్యాంక్ ఖాతాల్లోకి రూ.15 వేల చొప్పున ప్రభుత్వం జమ చేసింది. కొత్తపల్లి మండలంలో సుమారు 8000 మంది విద్యార్థులు అమ్మఒడి పథకం ద్వారా లబ్ధిపొందారు. వితౌహెల్డ్‌లో ఉన్న లబ్ధిదారుల వివరాలను మరో పర్యాయం పరిశీలించి అర్హుల జాబితాలోకి చేర్చే విధంగా విద్యాశాఖాధికారులు కసరత్తు చేస్తున్నారు. నియోజకవర్గంలో 28 జిల్లా ప్రజా పరిషత్, 19 ప్రాథమికోన్నత, 125 ఎంపీపీ పాఠశాలలు ఉన్నాయి. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో జాయిన్ చేయడానికి ముందుకు రావడంతో నియోజకవర్గంలో లక్ష్యానికి మించి సుమరు 2 వేల మందికి పైగా ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో జాయిన్ అయినట్లు విద్యాశాఖాధికారులు తెలిపారు.

పేద కుటుంబాలకు వరం



మాది నిరుపేద కుటుంబం. నేను, నాభర్త కూలి పని చేసుకుంటూ మా పిల్లలను చదివించుకోవడం చాలా కష్టంగా ఉండేది. ప్రభుత్వం ఉచితంగా యూనిఫాం, పుస్తకాలు ఇచ్చినా ఇతర ఖర్చులకు మాకు వచ్చే కూలి డబ్బులు సరిపోయేవి కావు. ఈ తరుణంలో అమ్మఒడి పథకం మాకు వరంలా మారింది. చదువుల ఖర్చు జగనన్న ఇస్తాడని తెలిసి వాళ్లని బడి మాన్పించకూడదని నిర్ణయించుకున్నాను.

– గంటా మరియమ్మ, విద్యార్థిని తల్లి, ఉప్పాడ

కొండంత అండ



మా చిన్నప్పుడు తల్లిదండ్రులు స్కూల్‌కు పంపకపోవడంతో పెద్దగా చదువుకోలేకపోయాము. అందుకే కూలి పనులకు పరిమితమయ్యాము. మా లాగా మా పిల్లలు కాకూడదని, చదివి గొప్పవారు కావాలని ఆశపడేదానిని. ఈ తరుణంలో అమ్మఒడి పథకం మా కుటుంబానికి అండగా నిలిచింది. ఈ పథకం ద్వారా ఏటా ఆర్థిక సాయం అందడంతో మాపై పిల్లల చదువుల భారం తగ్గింది.

– మడి కొండమ్మ, విద్యార్థిని తల్లి, ఉప్పాడ

విద్యార్థుల సంఖ్య పెరిగింది



కాన్వెంట్లు, ప్రైవేటు పాఠశాలలకు చెందిన పిల్లలు చాలా మంది ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. ప్రభుత్వ పథకాలు అందరినీ ఆకర్షిస్తున్నాయి. గతంలో ప్రైవేటు పాఠశాలల్లో చదివించుకునే తల్లిదండ్రులు తమ పిల్లలను అక్కడ మాన్పించి సర్కారీ స్కూళ్లలో జాయిన్ చేస్తున్నారు. నాడు–నేడు అభివృద్ధి పనులతో పాఠశాలల రూపు రేఖలు మారిపోయాయి.

– వేణుగోపాల్, ఎంఈఓ, కొత్తపల్లి మండలం

నేటి నుంచి హనుమాన్ చాలీసా పారాయణ

సామర్లకోట: స్థానిక కన్యకా పరమేశ్వరిరి ఆలయంలో ఆదివారం నుంచి ఆగస్టు ఐదో తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 6 నుంచి సాయంత్రం 5 వరకు హనుమాన్ చాలీసా పారాయణం జరుగుతుందని పంచారామ క్షేత్ర ట్రస్టు బోర్డు చైర్మన్ మట్టపల్లి రమేష్‌బాబు తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ పెద్దాపురం ధర్మ గీతా ప్రచారకులు మల్లికార్జునస్వామి ఆధ్వర్యంలో వివిధ గ్రామాలకు చెందిన భక్త మండళ్లచే పారాయణ జరుగుతుందన్నారు. వాసవీ ఉత్సవ కమిటీ, ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య మహిళా సంఘం, వాసవీ యూత్ అండ్ ఫ్రెండ్స్, వాసవీ యంగ్ బాయ్స్, వాసవి వనితా క్లబ్, వాసవి కపుల్స్ క్లబ్ భీమేశ్వర సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రతి రోజు సాయంత్రం 5 నుంచి 6.30 వరకు ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచన కర్త పోల్నాటి గోవిందరావుచే సుందరకాండ రామాయణంలో హనుమాన్ వైభవం గురించి ప్రవచనాలు చేస్తారని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలన్నారు.

ధ్యానంతో మానసికోల్లాసం



ధ్యానం చేస్తున్న విద్యార్థులు

పిఠాపురం: ధ్యానం చేయడం ద్వారా మనస్సుకు ఆహ్లాదం (మానసికోల్లాసం) కలుగుతుందని దుర్గా ప్రసాద్ బన్సీలాల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సరిత అగర్వాల్ అన్నారు. పిఠాపురం పట్టణంలోని విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠంలో నూతనంగా నిర్మించిన ఆశ్రమాన్ని హైదరాబాద్‌కు చెందిన దుర్గా ప్రసాద్ బన్సీలాల్ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులు, ప్రిన్సిపాల్‌తో కలిసి శనివారం సందర్శించారు. పీఠం విశిష్టతను విద్యార్థులకు పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు వివరించారు. ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలను తెలియజేశారు. అనంతరం ధ్యానం చేశారు. కార్యక్రమంలో జీవనది ఫౌండేషన్ అధ్యక్షురాలు దుర్గా మహాలక్ష్మి, కుమార్, చంటి తదితరులు పాల్గొన్నారు.

నేడు సొసైటీ గోదాము ప్రారంభం

సామర్లకోట: మండల పరిధిలో పీబీ దేవం గ్రామంలో రూ.13 లక్షలతో నిర్మించిన సొసైటీ గోదాములను ఆదివారం ప్రారంభిస్తున్నట్లు సొసైటీ అధ్యక్షుడు మలకల వరాలబాబు తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ సొసైటీ కార్యకలాపాలు అభివృద్ధిలో భాగంగా త్వరలో కిరాణా సరకులు విక్రయించనున్నట్లు చెప్పారు.

ఘనంగా విష్ణు, లలితాసహస్ర నామ పారాయణలు

ఏలేశ్వరం: అధిక శ్రావణ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని స్థానిక సత్యనారాయణస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు, పలు పారాయణలు నిర్వహించారు. విశ్వ హిందూ పరిషత్ అనుబంధ మాతృశక్తి, దుర్గావాహిని మహిళాసంఘాల ఆధ్వర్యంలో విష్ణు సహస్ర, లలితాసహస్ర నామ పారాయణలు చేసి భక్తిగీతాలు ఆలపించారు. అనంతరం పరిషత్ రాష్ట్ర కమిటీ సభ్యుడు నడిశెట్టి తిరుపతిరావు భగవద్గీత పఠనం చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ప్రతినిధులు ఏడీవీ ప్రసాద్, కటకం కిరీటీ, ఉడతల రమణారావు, సంఘ మహిళా సభ్యులు మల్లేశ్వరి, ఇందిరా, పద్మజ, రమాదేవి, రమ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధికే గడప గడపకూ..

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి వీర్రాఘవరావు



వడ్లమూరు రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న వీర్రాఘవరావు

పెద్దాపురం: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ‘గడప గడపకూ మన ప్రభుత్వం’ ద్వారా గ్రామాల అభివృద్ధి సాధ్యపడుతుందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీర్రాఘవరావు అన్నారు. మండలంలోని వడ్లమూరు గ్రామంలో ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు గడప గడపకూ మన ప్రభుత్వం పూర్తి చేసిన తరువాత సుమారు రూ.20 లక్షలతో చేపట్టే అభివృద్ధి పనులను శనివారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వీర్రాఘవరావు, వైస్ ఎంపీపీ కంటే వీరప్రభావతి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలుతో పాటు గ్రామాలకు అవసరమైన అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఈ నిధులు ఎంతో దోహదం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కళ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ మురళి, బిక్కిన సాయి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యదేవుని ప్రాకార సేవ



సత్యదేవుని ప్రాకారసేవలో భాగంగా తిరుచ్చి వాహనాన్ని మోస్తున్న దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ప్రాకారసేవ శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ పండితులు ఉదయం 10 గంటలకు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లను తిరుచ్చి వాహనం మీద ప్రతిష్ఠించి తూర్పు రాజగోపురం వద్ద గల ఆలయ ప్రాకారంలోకి ఊరేగింపుగా తీసుకువచ్చారు. అక్కడ ప్రత్యేక పూజలు చేసి వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాకారంలో స్వామి, అమ్మవార్లను మూడుసార్లు ఊరేగించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ఊరేగింపుగా ప్రధానాలయానికి చేర్చారు. దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ స్వామివారి ప్రాకారసేవలో పాల్గొని కొంతసేపు తిరుచ్చి వాహనాన్ని మోశారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ చంద్రశేఖర్ అజాద్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సత్యదేవుని వ్రతమాచరించిన దేవదాయశాఖ కమిషనర్ దంపతులు



దేవదాయశాఖ కమిషనర్‌కు సత్యదేవుని చిత్రపటాన్ని అందజేస్తున్న చైర్మన్ ఐవీ రోహిత్

అన్నవరం: రాష్ట్ర దేవదాయ, ధర్మాదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ దంపతులు శనివారం రత్నగిరిపై సత్యదేవుని వ్రతమాచరించి స్వామివారిని దర్శించారు. ఆలయం వద్ద వారికి పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారి వ్రతకథను విశ్రాంత వైదిక సలహాదారు నాగాభట్ల కామేశ్వరశర్మ, కల్యాణబ్రహ్మ ఛామర్తి కన్నబాబు, వ్రతపురోహితుడు పాలంకి పట్టాభి వివరించారు. అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేయగా స్వామివారి చిత్రపటాన్ని దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, స్వామివారి ప్రసాదాలను ఈఓ చంద్రశేఖర్ అజాద్ అందజేశారు.

శృంగార వల్లభుని దర్శనానికి భక్తుల రద్దీ



భక్తుల నుంచి పూజలందుకుంటున్న తిరుపతి శృంగారవల్లభ స్వామి



స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

పెద్దాపురం: మండలంలోని తిరుపతి శృంగార వల్లభుని ఆలయానికి శనివారం భక్తుల రద్దీ పెరిగింది. ఆలయ చైర్మన్ కర్రి వెంకట జగదీశ్వరరావు, ఈఓ పులి నారాయణమూర్తి ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. ఆలయ టిక్కెట్లు, అన్నదానం, కేశ ఖండన ద్వారా స్వామికి 4,52,814 రూపాయలు ఆదాయం సమకూరినట్లు ఈఓ తెలిపారు. స్వామి వారి దర్శనానికి వచ్చిన నూతన దంపతులకు, దాతలకు ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమచార్యులు, నారాయణాచార్యులు ఆధ్వర్యంలో వేదపండితులు శేష వస్త్రంతో సత్కరించి స్వామి వారి చిత్రపటాలను అందజేశారు. సుమారు ఆరు వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి తిరు కల్యాణోత్సవం

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి తిరు కల్యాణోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో అర్చకులు శాస్త్రోక్తంగా స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో స్కేటింగ్ రింక్



స్కేటింగ్ రింక్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

- సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: స్మార్ట్ సిటీ నిర్మాణంలో భాగంగా అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందుతున్న స్కేటింగ్ రింక్ పనులను ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి శనివారం సందర్శించారు. స్థానిక వివేకానంద పార్కు ఆవరణలో నిర్మాణంలో రింక్ ప్రగతిని అక్కడ ఉన్న అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులను మరింత వేగవంతం చేసి త్వరలోనే వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కేటింగ్ క్రీడను మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్కేటింగ్‌పై ఆసక్తి కలిగిన వారిని మరింత ప్రోత్సహించేందుకు, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలు నిర్వహించేందుకు వీలుగా ఇక్కడ రింక్ నిర్మాణం అవుతుందన్నారు. స్కేటింగ్ రింక్ నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని ఆయన కోరారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, కన్వీనర్లు, గృహ సారథుల సభ్యులు సుంకర సాగర్, డీఈ రామారావు తదితరులు ఆయన వెంట ఉన్నారు.

కొబ్బరి పథకాలు మాకో!

- దింపు, ఒలుపులో చదలాడ గ్రామస్తులు
- సుమారు 70 కుటుంబాలకు ఆధారం
- ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూపులు



చదలాడ కొబ్బరి ఒలుపులో బిజీగా ఉన్న కార్మికులు

పెద్దాపురం: కొబ్బరి పేరు చెబితే గుర్తొచ్చేది కోనసీమ. అక్కడ దింపు, ఒలుపు కార్మికులకు ప్రభుత్వం ఏ విధమైన చేయూతనిస్తోందో మెట్టలోని ఏటిపట్టు గ్రామాల్లో కూడా అలానే ఇచ్చి ఆదుకోవాలని మండలంలోని చదలాడ కార్మికులు కోరుతున్నారు. సుమారు 75 కుటుంబాలకు చెందిన దాదాపు 200 మంది కార్మికులు గ్రామంలో ఒలుపు పనిలో జీవిస్తున్నారు.

కష్టపడి పనిచేస్తే రూ.250 కూలీ

ఉదయం నుంచి సాయంత్రం వరకు కొబ్బరి ఒలుపులో పని చేస్తే వచ్చేది రూ.250. 100 కాయలు ఒలిస్తే రూ.40 చొప్పున కమిషన్‌కు పనిచేస్తే సుమారు రూ.400కు మించి ఒలవడం కష్టమే. కనీసం ప్రభుత్వం నుంచి తమకు ఎటువంటి ప్రత్యేక సాయం లేకపోవడంపై కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కష్టపడి పని చేస్తున్న తమకు కనీసం రుణాలిచ్చి ఆదుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

కాపు సామాజిక వర్గీయులే ఎక్కువ

కొబ్బరి ఒలుపు, దింపు కార్మికుల్లో శెట్టిబలిజ కుటుంబాలతో కాపు సామాజిక యువత ఎక్కువ ఉన్నారు. గ్రామానికి చెందిన బీసీ సామాజిక వర్గంతో పాటు కాపు, రజక, బలిజ కుటుంబాలు కొబ్బరి ఒలుపుపై ఆధారపడి ఉన్నారు. ఆయా కార్పొరేషన్ల ద్వారా అయినా తమకు రుణాలిచ్చి ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



కోనసీమ కొబ్బరి దింపు కార్మికులలానే ప్రభుత్వం మమ్మల్ని అన్ని విధాలా ఆదుకోవాలి. ఆయా సామాజిక వర్గం నుంచి రుణాలివ్వడంతో పాటు ప్రభుత్వ కార్మిక సంక్షేమ సంక్షేమ పథకాలు మంజూరు చేయాలి

– మేడిద వెంకన్న, ఒలుపు కార్మికుడు, చదలాడ

గిట్టుబాటు ధరలేక



ప్రభుత్వం కొబ్బరి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి. కార్మికులకు కమీషన్ పెంచాలంటే మార్కెట్‌లో సరైన గిట్టుబాటు ధర కల్పించడం లేదు. వంద కొబ్బరి రూ.800 నుంచి రూ.900 వరకు ధర కల్పిస్తే ఖర్చులు వగైరాతో కూలీలకు సరైన కమీషన్ ఇవ్వలేకపోతున్నాం

– శైల గణేశ్వరరావు, కొబ్బరి వ్యాపారి, చదలాడ

సారా బెల్లం నిల్వలపై ఎస్‌ఈబీ దాడులు

ముగ్గురు వ్యక్తుల అరెస్టు



గోకవరం శివారున సారా బట్టీపై దాడి చేసిన ఎస్‌ఈబీ అధికారులు

గోకవరం: మండలంలోని సారా బెల్లం నిల్వలపై కోరుకొండ ఎస్‌ఈబీ అధికారులు శనివారం దాడులు చేశారు. ఎస్‌ఈబీ అడిషనల్ ఎస్పీ పి.సోమశేఖర్ ఆదేశాల మేరకు కోరుకొండ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో గోకవరం శివారున సారా బట్టీలపై దాడి చేసి 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఈ దాడిలో కాండ్రేగుల రాము అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. అతడిని విచారించారు. తనకు గోకవరానికి చెందిన ముప్పిడి నాగేశ్వరరావు, కొత్తపల్లికి చెందిన నాయుడు రాజేష్ సారా బెల్లం సరఫరా చేస్తున్నట్టు చెప్పగా వారిని అదుపులోకి తీసుకున్నారు. వారికి చెందిన సారా బెల్లం నిల్వలపై దాడులు చేసి 2,450 కేజీల సారా బెల్లం స్వాధీనం చేసుకున్నారు. వీరి ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం రాజమహేంద్రవరం కోర్టుకు తరలించారు. ఈ దాడిలో ఎస్సై టి.నిరంజనరావు, హెచ్‌సీలు శివకుమార్, నాగేంద్రకుమార్, అప్పారవు, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్టు

జగ్గంపేట: మండలంలోని కాట్రావులపల్లి గ్రామ శివారులో పేకాట శిబిరంపై శనివారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పేకాడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ.3800 స్వాధీనం చేసుకున్నట్టు జగ్గంపేట ఎస్సై విద్యాసాగర్ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్టు తెలిపారు.